సాక్షి
మంచిర్యాల
సోమవారం। 5। ఫిబ్రవరి। 2024



ప్రశాంతంగా సీవోఈ సెట్

తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 ప్రశాంతంగా జరిగింది. 8లో▸



వన జాతరకు 'ప్రత్యేకం' 8లో▸

వనదేవతల జాతరకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, చెన్నూర్‌తో పాటు ఆసిఫాబాద్ నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది.

గరిష్టం/కనిష్టం
34.2 /21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రత కూడా పెరిగి చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

పత్తిరైతు గోస పట్టేదెవరికి?

- జిల్లాలో తరచూ నిలిచిపోతున్న కొనుగోళ్లు
- మిల్లుల వద్దే నిరీక్షిస్తున్న రైతులు
- సీసీఐ తీరుతో రంగంలోకి దళారులు
- జిల్లాలో పత్తి రైతులకు తప్పని తిప్పలు



తాండూర్ మండలంలోని జిన్నింగ్ మిల్లుల వద్ద బారులుతీరిన పత్తి వాహనాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: అమ్మబోతే అడవి అన్నట్లుగా తయారైంది జిల్లాలో పత్తిరైతుల పరిస్థితి. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని అమ్ముకునేందుకు మిల్లుల్లోని సీసీఐ కేంద్రాలకు తెస్తున్న రైతులు అక్కడ అరిగోస పడుతున్నారు. కొనుగోళ్లలో జాప్యం, తరచూ కొనుగోళ్లు నిలిపివేస్తుండడంతో రోజుల తరబడి కేంద్రాల వద్దనే నిరీక్షించాల్సి వస్తోంది. సహనం కోల్పోతున్న రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. రోడ్డెక్కుతున్నారు.

తరచూ కొనుగోళ్లకు బ్రేక్..

జిల్లాలో సీసీఐ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పత్తి సేకరణను తరచూ నిలిపివేస్తున్నారు. నాణ్యమైన పత్తి రావడం లేదని కొన్ని రోజులు, జిన్నింగ్ మిల్లుల్లో నిల్వలు పేరుకుపోయాయని కొన్ని రోజులు, వాతావరణ మార్పుల సాకుతో మరికొన్ని రోజులు కొనుగోళ్లకు బ్రేక్ వేస్తున్నారు. సీసీఐ సాకులను దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన వెంటనే రంగంలోకి దిగుతున్న దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా నిరీక్షించే ఓపిక లేక దళారులకే అమ్ముకుంటున్నారు. సీసీఐ తీరు ప్రైవేట్ వ్యాపారులకు కలిసి వస్తోంది.

ధర తగ్గింపు..

పత్తికి ఈ ఏడాది కేంద్రం క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. మొదట మద్దతు ధరకే సీసీఐ పత్తి కొనుగోళ్లు జరిపింది. ప్రస్తుతం పింజ పొడవు మైక్‌వ్యాల్యూ తక్కువగా వస్తుందని ధర రూ.30 నుంచి రూ.50 వరకు తగ్గించి కొనుగోలు చేస్తోంది. ఆలస్యంగా పంట సాగుచేయడం, కూలీల కొరత కారణంగా ఆలస్యంగా సేకరిస్తుండడంతో మిల్లులకు కూడా ఆలస్యంగానే రైతులు పత్తి తీసుకొస్తున్నారు. 20 రోజులుగా పెద్ద ఎత్తున పత్తి మిల్లులకు వస్తోంది.

దళారుల హవా..

జిల్లాలో డిసెంబర్ నుంచి పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. జనవరి 17 నుంచి పెద్ద ఎత్తున పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. ఒక్కసారిగా వాహనాలు భారీగా రావడంతో మిల్లుల్లో పత్తి నిలవలు పేరుకుపోతున్నాయి. దీంతో కొనుగోళ్లు నెమ్మదిస్తున్నాయి. ఇదే సమయంలో అధికారుల సహకారంతో దళారులు రంగంలోకి దిగుతున్నారు. ఇటు తూకం వేయగానే డబ్బులు ఇస్తామని ఆశ చూపి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్ రూ.6,300 నుంచి రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ.800 వరకు నష్టపోతున్నారు.

కొన్నది 25 శాతమే..

జిల్లాలో ఈఏడాది 1.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 12 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. గత నవంబర్ నుంచి సీసీఐ చెన్నూర్ వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో 3, బెల్లంపల్లి మార్కెట్ పరిధిలో 2, లక్సెట్టిపేట మార్కెట్ పరిధిలో ఒక జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లు జరుపుతోంది. ఇప్పటి వరకు 2,63,748 క్వింటాళ్లు సేకరించగా, ప్రైవేట్ వ్యాపారులు 88,827 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి రా గా, ఇప్పటి వరకు కేవలం 3,52,575 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. మ రో 2 లక్షల క్వింటాళ్లు ఇతర జిల్లాకు వెళ్లింది. ఇంకా 5 లక్షల క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు రావాల్సి ఉంది. జిల్లాలో సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయాలు తరచూ నిలిపివేస్తుండడంతో చాలా మంది రైతులు పొరుగున ఉన్న పెద్దపల్లి, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు వెళ్లి అమ్ముకుంటున్నారు. త క్కువ దిగుబడి వచ్చిన రైతులకు మాత్రం అమ్మకానికి అగచాట్లు తప్పడం లేదు.

ఇప్పటి వరకు జిల్లాలో సేకరించిన పత్తి

సీసీఐ	2,63,748 క్వింటాళ్లు
ప్రైవేట్	88,827 క్వింటాళ్లు

అమ్ముకునేందుకు అరిగోస..



దుక్కిదున్నికాడి నుంచి మొదలు వానాపడుతుందోలేదనని, మొలక వస్తుందో లేదో అని, పంట ఎదుగుతుందోలేదా అని, పూత, కాత మంచిగా వస్తుందా.. దిగుబడి వస్తుందా అని తిప్పలు పడుతం. ఇప్పుడు ఆరకొరగా చేతికి వచ్చిన పంటకు అమ్ముకునేందుకు మిల్లుకాడా పడి గాపులుకాసుడు అయితంది. ఎప్పుడు కొంటరో ఎప్పుడు బందు పెడ్తరో తెలుస్తలేదు.

– రమేష్, నెన్నెల

మిల్లులు నిండడంతోనే..



జిల్లాలో తక్కువగా జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. పత్తి నిలవలు, ఇటు పత్తి బెడ్లు నిండిపోవడంతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తుంది. అమ్మకానికి ముందుగా వచ్చిన రైతులకు టోకెన్లు ఇస్తున్నారు. సేకరణ వేగవంతం చేయాలని, పత్తి బెడ్లు వెంటవెంటనే తరలించాలని ఆదేశిస్తున్నాం.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

న్యూస్‌రీల్

'భట్టి'ని కలిసిన మాలమహానాడు నాయకులు



భట్టితో మాట్లాడుతున్న నాయకులు

పాతమంచిర్యాల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను మాల మహానాడు నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం కలిశారు. ఎస్సీ వర్గీకరణపై డిప్యూటీ సీఎంతో చర్చించామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి, ప్రతీ జిల్లాకు ఎస్సీ, ఎస్టీ చైర్మన్లను నియమించాలని, దళితబంధు పథకం అమలును పునఃపరిశీలించాలని వినతిపత్రం ఇచ్చారు. భట్టిని కలిసిన వారిలో జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కాసర్ల యాదగిరి, ఉపాధ్యక్షులు సోగాల కిష్టయ్య తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రయోగ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 578 మందికి 556 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 224 మందికి 196 మంది హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు జనరల్ విద్యార్థులు 417 మందికి 405 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 240 మందికిగాను 11 మంది గైర్హాజరు కాగా, 229 మంది హాజరయ్యారని డీఐఈవో శైలజ వివరించారు.


బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా పదాధికారుల సమావేశం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు చేపట్టాల్సిన రథయాత్ర, చలో అభియాన్, అయోధ్య దర్శన్, నారీశక్తి వందన్ కార్యక్రమాలపై జిల్లా, మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు విజయవంతం చేసి, నిత్యం ప్రజల మధ్య ఉంటూ లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లిలో బీజేపీని గెలిపించాలని కోరారు.

తల్లులకు 'బంగారం' మొక్కులు



బంగారం తూకం వేయిస్తున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెండేళ్లకోసారి జరి గే సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తుండటంతో భక్తులు బంగారం మొక్కుల్లో బిజీ అయిపోయారు. మేడారం సమ్మక్క–సారక్క మహాజాతర ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరగనుంది. ఈ నేపథ్యంలో భక్తులు ఇళ్లల్లో సమ్మక్క–సారలమ్మలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోరుకున్న కోరికలు నెరవేరడం కోసం, కోరిన కోరికలు తీరిన వారు తల్లులకు అత్యంత ఇష్టమైన బంగారం(బెల్లం)తో నిలువెత్తు తూకం వేయించుకుంటున్నారు. ఆదివారం అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునేందుకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోనే కాకుండా గ్రామాల్లో బంగారం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దుకాణాల ముందు డప్పు చప్పుళ్ల మధ్య త్రాసుకు పూజలు చేసిన తర్వాత మొక్కు కోసం త్రాసులో కూర్చుంటే వారి ఎత్తు బంగారం తూకం వేయించా రు. తూకం వేసిన బెల్లాన్ని సమ్మక్క–సారక్క బంగారం అంటూ భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టారు.

7న క్లర్క్ నియామకపత్రాలు అందజేత

శ్రీరాంపూర్: సింగరేణి క్లర్క్ ఉద్యోగాలకు సెలక్ట్ అయి ఎన్నికల కోడ్‌తో నిలిచిన నియామకాలకు ఈనెల 7న నియామకపత్రాలు యాజమాన్యం అందిస్తుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంత్రులు సెలక్ట్ అయిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తారని పేర్కొన్నారు. ఈనెల 6న నిర్వహించాల్సిన యూనియన్ సెంట్రల్ ఎగ్జిక్యూటీవ్‌ల మీటింగ్‌ను వాయిదా వేసినట్లు తెలిపారు.

పద్మశాలీల సంక్షేమానికి కృషి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. క్యాతనపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో క్యాతనపల్లి మున్సిపాలిటీ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తెలంగాణ కోసం కొండా లక్ష్మణ్‌బాపూజీ చేసిన పోరాటాన్ని తన తండ్రి వెంకటస్వామి ఎప్పుడూ చెప్పేవారన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి మంచిర్యాల జిల్లాకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కాంగ్రెస్ నాయకుడు, వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ, సంఘం క్యాతనపల్లి అధ్యక్షుడు వనం సత్యనారాయణ, కార్యదర్శి ఆడెపు తిరుపతి, మేరుగు రాజేశం, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గం

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తహసీల్దార్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక విద్యుత్ తరంగిణి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా వర్ణ, అసోసియేట్ అధ్యక్షులుగా భోజన్న, శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా సుభాష్ చందర్, శ్రీనివాస్, నలందప్రియా, కోశాధికారి గా ఇమ్రాన్‌ఖాన్, ప్రచార కార్యదర్శిగా దిలీప్‌కుమార్, కార్యదర్శులుగా తుకారాం, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస రావు, లక్ష్మి, వేణుగోపాల్ ఎన్నికయ్యారు.

ఏడాదికి మూడు పంటలు పండించాలి

- ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయండి
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు
- జిల్లా కేంద్రంలో రైతు అవగాహన సదస్సు, ప్రదర్శన



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో రైతులు ఏటా మూడు పంటలు పండించే దిశగా ఆలోచన చేయాలని, ఈమేరకు అధికారులు రైతులను ప్రోత్సహించాలని, ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలు, కృషి విజ్ఞాన కేంద్రం, బ్యాంకు అధికారులతో కలిసి ఆదివారం రైతు అవగాహన సదస్సు, ప్రదర్శన నిర్వహించాయి. కార్యక్రమానికి హాజరైన అధికారులతో వ్యవసాయరంగం పురోగతిపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మంచిర్యాల నియోజకవర్గంలో సాగునీరు అందుబాటులో ఉన్నందున రైతులు వరి, కూరగాయలు, ఇతర లాభదాయక పంటలు సాగుచేసి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మంచిర్యాలకు కూరగాయలు దిగుమతి అవుతున్నాయని, ఈ ప్రాంతంలోనే కూరగాయలు పండిస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. పాడి ద్వారా పాల ఉత్పత్తి పెంచాలని సూచించారు. రైతులకు అన్ని రకాలుగా సహకారం అందిస్తామని తెలిపారు.

వ్యవసాయరంగం అభివృద్దే లక్ష్యం..

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగం అభివృద్దే తన లక్ష్యమన్నారు. రైతులకు ప్రభుత్వ శాఖల సహకారంతో పాటు, బ్యాంకులు సహకరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. మంచిర్యాలను అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

ప్రతీరైతు లబ్ధి పొందేలా పథకాలు

రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, ప్రతీరైతు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ, నాబార్డ్ సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రతీ రైతుకు అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. సమీకృత, ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించి ఆరోగ్యకరమైన పంట దిగుబడితో సమాజ శ్రేయస్సుకి రైతులు కృషి చేయాలని సూచించారు. పంటలు విక్రయించేందుకు మార్కెటింగ్ వ్యవస్థలోని ఇబ్బందులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం ద్వారా ఆదాయం పొందాలని సూచించారు. భూసార పరీక్షలను నిర్వహించి మట్టిలో ఆర్గానిక్ కార్బన్ పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రైతు కుటుంబం రెండు గేదెలు పెంచాలని సూచించారు. బ్యాంకుల ద్వారా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు, గొర్రెలు, మేకలు, చేపలు, కోళ్ల పెంపకం, రైస్ మి ల్లులు, పత్తి మిల్లులు, గోదాములు, కోల్డ్‌స్టోరేజ్ రుణాలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రతీరైతు రూ.230 చెల్లించి, రైతుకి బీమా పొందడం ద్వారా రైతు మృతి చెందితే రూ.2 లక్షల పరిహారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాహుల్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రమేశ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్‌కుమార్, హాజీపూర్ రై తు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు గోనె శ్యాంసుందర్ రావు, శంకర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం అధికారి శివకృష్ణ, ప్రధానమంత్రి అవార్డు గ్రహీత మల్లికార్జున్‌రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు

- గ్రామ, మండలస్థాయిలో పూర్తయిన సమావేశాలు
- 16న జిల్లా పరిషత్ సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకునేందుకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అభివృద్ధి పనుల ప్రాధాన్యతను గుర్తించేందుకు సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ క్రమంలో జనవరి 22 నుంచి 27వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించారు. అభివృద్ధి ప్రణాళికలు తయారు చేశారు. మండల స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించి అభివృద్ధి ప్రణాళికలకు ఆమోదం తెలిపారు. గుర్తించిన పనుల ప్రణాళికలన్నింటినీ జనవరి 31వ తేదీ వరకు గ్రామస్వరాజ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, పరిశుభ్రత, సుపరిపాలన, బాలబాలికల సంరక్షణ, మహిళా సాధికారత, తాగునీరు, ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించడం, పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు ఇప్పించడం వంటి అంశాలను గ్రామసభల్లో గుర్తించారు.

16లోగా పూర్తి చేయాలి..

ఇక మండల స్థాయిలో నిర్వహించే జీపీడీపీ ప్రణాళిక తయారీ సమావేశాలు ఈనెల 16లోగా పూర్తి చేయాల్సి ఉంది. మండల స్థాయిలో జీపీడీపీ నోడల్ అధికారిగా ఎంపీడీవోలు వ్యవహరిస్తారు. అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేస్తూ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేశారు. మొత్తంగా మండల స్థాయిలో సమావేశాలు వెనువెంటనే సమావేశాలు పూర్తి చేసి ఆమోదించిన అభివృద్ధి ప్రణాళికలను గ్రామస్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. మండల కేంద్రాల నుంచి గ్రామాలను అనుసంధానించే రోడ్లు, మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

16న జెడ్పీ సమావేశం..

జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక నోడల్ అధికారిగా జిల్లా పరిషత్ సీఈవో వ్యవహరిస్తారు. గ్రామ, మండల స్థాయిలో జీపీడీపీ సమావేశాలతో పాటు ప్రణాళికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం పూర్తిచేసి ఈనెల 16న జిల్లా పరిషత్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలపై చర్చిస్తారు. ఈ ప్రణాళికల పూర్తికి అవసరమైన నిధులతోపాటు అదనంగా మరో 10 శాతం నిధులు కోరుతూ 15వ ఆర్థిక సంఘం ఉన్నతాధికారులకు సిఫారసు చేయనున్నారు. నిధులు మంజూరు కాగానే ప్రజల సమక్షంలోనే అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యతా ప్రకారం గుర్తించి పనులు చేపడతారు.

అవిశ్వాస చదరంగం.. గెలిచేదెవరో?

- స్వపక్షంలో విపక్ష రాజకీయం బెడిసికొట్టినట్లేనా..?
- 'చేతి'కి చిక్కనున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ పదవులు
- ఆసక్తికరంగా క్యాతనపల్లి మున్సిపల్ రాజకీయం



క్యాంపులో ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీలో జరుగుతున్న అవిశ్వాస చదరంగంలో రాజకీయాలు అనూహ్య మలుపు తిరుగుతున్నాయి. ఇందులో గెలిచేదెవరో అన్న ఉత్కంఠ పెరుగుతోంది. స్వపక్షంలో విపక్షం తరహా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన బీఆర్ఎస్ నాయకులు గెలుస్తారా.. కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసం పెట్టిన స్వపక్షాన్ని దెబ్బకొట్టిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ నెగ్గుతారా అన్న చర్చ మున్సిపాలిటీలో జరుగుతోంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు సొంతపార్టీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసంతో ఆ పార్టీ బల్దియాలో పట్టు కోల్పోయే పరిస్థితి వచ్చింది. కీలక పదవులు 'చేతి'కి చిక్కబోతున్నాయి.

రేపు అవిశ్వాస తీర్మానం..

క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై ఇచ్చిన అవిశ్వాసం నోటీసులపై ఈనెల 6న సమావేశం నిర్వహించనున్నారు. పరిస్థితి చూస్తుంటే ఈ సమావేశంలో అవిశ్వాసం వీగిపోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవిశ్వాసం పెట్టే అవకాశం కాంగ్రెస్‌కు ఇవ్వొద్దన్న ఆలోచనతో బీఆర్ఎస్‌లోని కౌన్సిలర్లే అనూహ్యంగా సొంత పార్టీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. పదవులపై ఆశతో వ్యూహాత్మకంగా పావులు కదిపిన కొంతమంది 17 మంది సంతకాలతో కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు ఇచ్చారు. మొత్తం 22 మంది కౌన్సిలర్లు ఉండగా 17 మంది అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేయడంతో చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి పదవి పోవడం ఖాయమని అంతా భావించారు. కానీ, ఇక్కడే చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ వర్గం అనూహ్య నిర్ణయం తీసుకుంది. వారిద్దరితోపాటు మరో ఎనిమిది మంది కౌన్సిలర్లను కలుపుకుని హస్తం ఊటీకి వెళ్లారు. దీంతో ఒక్కసారిగా సమీకరణలు మారిపోయాయి.

కోరం కష్టమే..

అవిశ్వాసంపై మంగళవారం నిర్వహించే సమావేశం జరిగే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తం 22 మంది కౌన్సిలర్లకు ఒక కౌన్సిలర్ గతంతో పదవికి రాజీనామా చేశాడు. 8 మంది కౌన్సిలర్లు ఇటీవల కాంగ్రెస్‌లో చేరి క్యాంపులో ఉన్నారు. మరో 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేరే క్యాంపులో ఉన్నారు. మిగిలిన ఐదుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు స్థానికంగా ఉన్నారు. వైజాగ్ క్యాంపులో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన సమావేశం ముగిసే వరకు అక్కడే ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ కూడా వాళ్లు జారిపోకుండా పల్లె రాజు, నీలం శ్రీనివాస్‌గౌడ్, పుల్లూరి కళ్యాణ్, మహంకాళి శ్రీనివాస్‌తో పర్యవేక్షిస్తోంది. మంగళవారం సమావేశం జరగాలంటే కనీసం 15 మంది సభ్యులు కావాలి. అప్పుడే అవిశ్వాసం నెగ్గుతుంది. కానీ, ప్రస్తుతం క్యాంపులో ఉన్న 8 బీఆర్ఎస్ కౌన్సిలర్లు, స్థానికంగా ఉన్న ఐదుగురు కలిపినా 13 మందే అవుతున్నారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గడం కష్టమే అని స్థానికంగా చర్చ జరుగుతోంది. అనూహ్య నిర్ణయంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ తమ పదవులు దక్కించుకోవడంతోపాటు బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న బల్దియాను కాంగ్రెస్ ఖాతాలో చేర్చడం ఖాయమని తెలుస్తోంది.

మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ విప్ బాల్క సుమన్
- క్యాతనపల్లిలో నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్

రామకృష్ణాపూర్: మోసపూరిత హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేయడంలో కరోనాకన్నా భయంకరంగా పనిచేసిందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. క్యాతనపల్లిలోని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వగృహంలో ఆదివారం చెన్నూర్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. నిరంజన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఆగమాగం చేసి గద్దెనెక్కిందన్నారు. హామీలను అమలు చేసే వరకు ఆ పార్టీని నిలదీయాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని కార్యకర్తలు అధైర్యపడకుండా పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఈర్ష్యపడేలా చెన్నూర్ నియోజకవర్గాన్ని బాల్కసుమన్ అభివృద్ధి చేశాడని తెలిపారు. అయినా సుమన్‌పై తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను తిరిగి టీఆర్ఎస్‌గా మార్చే విషయాన్ని పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు పార్టీని వీడినా పోయేది ఏమీ లేదన్నారు. వందమంది బలహీనులు ఉండడం కంటే ఇద్దరు బలమైన కార్యకర్తలు ఉంటే చాలన్నారు. తెలంగాణ ప్రజల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ మంత్రి బోడ జనార్దన్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ అవార్డుకు ఎంపిక



సుంకరి రమేశ్

మందమర్రిరూరల్: సింగరేణి మందమర్రి ఏరియాలో సీనియర్ ఇన్‌స్పెక్టర్(ఎస్అండ్‌పీసీ)గా విధులు నిర్వహిస్తున్న సుంకరి రమేశ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ హైదరాబాద్‌లో రమేశ్‌కు ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఈనెల 11న తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

అతడి కళ్లు సజీవం


బత్తిని సతీష్ (ఫైల్)

నెన్నెల(బెల్లంపల్లి): 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అంటారు పెద్దలు. అంతటి ప్రధానమైన నేత్రాలను మరణించాక మట్టిపాలు చేయకుండా ఓ యువకుడు హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు దానం చేసి ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళ్తే.. నెన్నెల మండలంలోని చిత్తాపూర్‌కు చెందిన బత్తిని సతీష్ (40) అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతి చెందాడు. అతని భార్య సుజాత, తండ్రి మల్లాగౌడ్, రామాయమ్మ ఇంటర్నెషనల్ ఐ బ్యాంకు వారికి సమాచారం అందించడంతో ప్రతినిధులు ఆస్పత్రికి వచ్చి కళ్లు సేకరించారు. సదరు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో దూకి వృద్ధుడు ఆత్మహత్య

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా గ్రామానికి చెందిన జాగరి శంకర్ (83) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. కొంత కాలంగా దగ్గు, దమ్ముతో బాధపడుతున్న శంకర్ జీవితంపై విరక్తి చెందాడు. ఆదివారం గ్రామ శివారులోని బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుమారుడు పోశాలు ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వేముల బస్తీకి చెందిన చెంబోతుల పోచయ్య(38) అనుమాన స్పదంగా మృతి చెందినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. పోచయ్య నాలుగేళ్లుగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఆదివారం మద్యం సేవించి భార్య ప్రవంతిపై దాడికి దిగడంతో తోసేసింది. ఈక్రమంలో అతనికి ఫిట్స్ వచ్చాయి. ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతిపై అనుమానం ఉందని పోచయ్య సోదరుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

కాగజ్‌నగర్‌రూరల్: రైల్వేకాలనీలోని రైల్వేక్వార్టర్‌లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై కళ్యాణ్ తెలిపారు. రైల్వేలో ఉద్యోగం చేస్తున్న రమేష్, స్వరూప దంపతులు రెండు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 15 గ్రాముల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం బృందం సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

భీమారం: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో గాలిపల్లి మహేశ్‌కు చెందిన మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. మహేష్ ఇంటివద్ద వంటకు ఉపయోగించిన బొగ్గులను ఇంటి వెనుకాల పోయడంతో అందులోంచి నిప్పురగులుకుని వరిగడ్డికి అంటుకుంది. ఫైరింజన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పివేశారు. ఘటనలో దాదాపు రూ.15 వేల పశుగ్రాసం కాలిపోయిందని బాధితుడు వాపోయాడు.

వైన్‌షాపులో చోరీకి యత్నం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న కనకదుర్గ వైన్‌షాపులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చోరీకి యత్నించారు. ఆదివారం తెల్లవారుజామున షాపు షెట్టర్‌ను గడ్డపారలతో తొలిగించే ప్రయత్నం చేసి విఫలమైనట్లు షాపు యజమాని సీసీ పుటేజీలో గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వన జాతరకు 'ప్రత్యేకం'

- మేడారానికి ఆర్టీసీ బస్సులు
- ఆరు పాయింట్ల నుంచి 320 సర్వీసులు
- సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే మహిళలకు ఫ్రీ జర్నీ
- 18 నుంచి 24 వరకు నడపనున్న ఆర్టీసీ


మంచిర్యాల ఆర్టీసీ డిపోలో బస్సులు

మంచిర్యాలఅర్బన్: వనదేవతల జాతరకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. సమ్మక్క, సారలమ్మ జాతరకు అధికంగా భక్తులు తరలివెళ్లే సింగరేణి ప్రాంతం నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమవుతోంది. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, చెన్నూర్‌తో పాటు ఆసిఫాబాద్ నుంచి మేడారం మహా జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తోంది. రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరతో బస్సుల ద్వారా ఆదాయం సమకుర్చుకోవాలని ఆర్టీసీ సంస్థ యోచిస్తోంది. జాతరకు కార్మిక క్షేత్రం మంచిర్యాల జిల్లా నుంచే భక్తులు అధికంగా వెళ్లివస్తుంటారు. ఈనేపథ్యంలో అమ్మవార్ల జాతరకు ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ల (పాయింట్‌లు) నుంచి బస్సుసర్వీసులు నడిపించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా డిపోల పరిధిలోని బస్సులను ఇక్కడి నుంచి రాకపోకలు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. భక్తుల తాకిడి ఉండే ప్రాంతాలల్లో ఆయా డిపోల అధికారులే స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సు సర్వీసులు నడిపించాలని యోచిస్తున్నారు. మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం (ఫ్రీ జర్నీ) కల్పించారు.

మంచిర్యాల జిల్లా నుంచే ఎక్కువ..

వనదేవతల జాతరకు ఆర్టీసీ మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 2020లో 304, 2022లో 320 బస్సులు నడపగా ప్రస్తుతం 365 బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనుంది. ఈ నెల 18 నుంచి 24 వరకు బస్సుసర్వీసులు రాకపోకలు సాగించనున్నాయి. కార్మిక క్షేత్రం శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, తాండూర్, రామకృష్టాపూర్ తదితర ప్రాంతాల నుంచి సమ్మక్క, సారలమ్మ జాతరకు అధికసంఖ్యలో భక్తులు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. మరోవైపు బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం చూపకుండా కార్మికుల సౌకర్యార్థం స్థానికంగానే జాతర నిర్వహిస్తున్నా మొదటికి (మేడారం) వెళ్లి మొక్కలు తీర్చుకునేందుకే కార్మిక కుటుంబాలు మొగ్గు చూపుతాయి.

బస్సులన్నీ మేడారం వైపే..

ఆర్టీసీ బస్సులన్నీ మేడారం క్యూ కట్టనున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆర్టీసీ 365 బస్సులు నడపనుంది. మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి 110 బస్సులను మేడారం జాతరకు నడిపించనున్నారు. ఆదిలాబాద్ డిపోకు చెందిన 65 బస్సులను చెన్నూర్ పాయింట్ నుంచి, ఆసిఫాబాద్ డిపోకు చెందిన 70 బస్సులను ఆసిఫాబాద్, బెల్లంపల్లి పాయింట్ల నుంచి, ఉట్నూర్ డిపోకు చెందిన 10 బస్సులు, భైంసాకు చెందిన 45 బస్సులను శ్రీరాంపూర్ పాయింట్‌కు, నిర్మల్ డిపోకు చెందిన 65 బస్సులను మందమర్రి పాయింట్‌కు కేటాయించారు. ఆయా పాయింట్ల నుంచి మేడారం జాతరకు బస్సులు నడిపించనున్నారు.

మహిళలకు ఫ్రీ జర్నీతో..

మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ జర్నీతో బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య రెట్టింపుగా మారింది. దీంతో డిపోలకు బస్సులు జాతరకు నడిపిస్తే ఎదురయ్యే ఇబ్బందుల నేపథ్యంలో ఈ ఏడాది జాతర సాగని ప్రాంతంతో పాటు రద్దీ తక్కువగా ఉన్న ఇతర జిల్లా డిపోల నుంచి బస్సులను సర్దుబాటు చేశారు. ఆయా డిపోల నుంచి పాయింట్ల వారీగా మొత్తం 180 బస్సులు కేటాయించారు. జాతరతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

టికెట్ చార్జీలు ఇలా..

బస్‌పాయింట్	కిలోమీటర్లు	పెద్దలు	పిల్లలు
చెన్నూరు	202	రూ.420	రూ.230
శ్రీరాంపూర్	190	రూ.400	రూ.210
మందమర్రి	215	రూ.450	రూ.250
మంచిర్యాల	200	రూ. 410	రూ.220
బెల్లంపల్లి	225	రూ.460	రూ.250
ఆసిఫాబాద్	265	రూ.550	రూ.300

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..

మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. సురక్షిత ప్రయాణం కోసం డ్రైవర్ల విధులపై ఆర్టీసీ యాజమాన్యం సూచనలు చేసింది. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలి.

– సోలొమన్ రాజ్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

'16న సమ్మె విజయవంతం చేయాలి'

శ్రీరాంపూర్: ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, ప్రదాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

'సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు'

కాసిపేట: సింగరేణిలో రాజకీయ జోక్యం తగదని ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ అన్నారు. ఆదివారం సోమగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ ఏఐటీయూసీ కృషి ఫలితంగా 146 మంది జూనియర్ అసిస్టెంట్లు మైన్స్ అండ్ డిపార్టుమెంట్‌లో జాయిన్ అయ్యారన్నారు. ఎన్నికల నేపథ్యంలో వారి నియామకాలు నిలిపివేయగా సీఅండ్ఎండీని కోరి ఒప్పించామన్నారు. వీరి నియామాక పత్రాలు ఏరియా జీఎం కార్యాలయాల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేతుల మీదుగా ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం హైదరాబాద్‌లో మంత్రుల చేతుల మీదుగా ఇప్పించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలు మానుకోవాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాయకులు దాసరి తిరుపతిగౌడ్, నాగేశ్వరరావు, మినుగు లక్ష్మీనారాయణ, గొల్లశ్రీనివాస్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో బహుమతులు


ప్రథమ బహుమతి అందుకుంటున్న ప్రణవ దీప్తి


తాను గీసిన చిత్రాన్ని అందజేస్తున్న కీర్తన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సినీ నటుడు, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం జన్మదినాన్ని పురస్కరించుకుని హన్మకొండలోని సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 28న హైదరాబాద్‌లో జాతీయ స్థాయి చిత్రకళా పోటీలు నిర్వహించారు. డ్రాయింగ్, పెయింటింగ్, డిజిటల్, మిక్స్‌డ్ మీడియా విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో హాజీపూర్ మండలం పెద్దంపేటకు చెందిన మేడారపు కీర్తన డ్రాయింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఆదివారం హైదరాబాద్‌లోని బ్రహ్మానందం స్వగృహంలో ఆయన చేతుల మీదుగా కీర్తన బహుమతి అందుకుంది. ఈ కార్యక్రమంలో కళాయజ్ఞ శేషబ్రహ్మం, అకాడమీ చైర్మన్ సాగంటి మంజుల పాల్గొన్నారు. తమ కుమార్తె బహుమతి సాధించినందుకు ఆనందంగా ఉందని కీర్తన తల్లిదండ్రులు మేడారపు లక్ష్మి, తిరుపతి సంతోషం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థి కీర్తన బహుమతి సాధించడంపై దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.హన్మాండ్లు, డ్రాయింగ్ మాస్టర్ మాదరబోయిన మూర్తి, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. కీర్తన ప్రస్తుతం హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో పెయింటింగ్ గ్రూప్‌లో మొదటి సంవత్సరం చదువుతోంది.

చిత్రకళా పోటీల్లో ప్రథమ బహుమతి

లక్సెట్టిపేట: ఈ నెల 2న హాస్య నటుడు బ్రహ్మానందం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సాగంటి ఆర్ట్ అకాడమి వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రకళా పోటీలలో లక్సెట్టిపేట పట్టణానికి చెందిన విద్యార్థిని నూటెంకి ప్రణవ దీప్తి పాల్గొని ప్రథమ బహుమతి సాధించింది. పద్మశ్రీ బ్రహ్మానందం పోర్ట్రెయిట్ చాలెంజ్ హన్మకొండ వారి ఆధ్వర్యంలో జనవరి 28న హైదరాబాద్‌లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో నాలుగు వందల మంది విద్యార్థులు పాల్గొనగా ప్రణవ దీప్తి ప్రథమ బహుమతి సాధించింది. ఆదివారం అకాడమి చైర్మన్ మంజుల, బ్రహ్మానందం చేతుల మీదుగా బహుమతి అందుకుంది. విజేతను తల్లిదండ్రులు రవీంద్రభారతి, కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

- దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 5,918
- హాజరైనవారు 5,774 మంది


బెల్లంపల్లి సీవోఈ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్సీవో స్వరూపారాణి

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదివారం నిర్వహించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్–2024 ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో మొత్తం 5,918 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 5,774 మంది హాజరుకాగా 144 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97.55 శాతం నమోదైనట్లు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ప్రకటించారు. సీవోఈ సెట్ నిర్వహణ కోసం ఆదిలాబాద్ రీజియన్‌లో మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నాలుగు, మంచిర్యాల జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జంబ్లింగ్ పద్ధతిలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతాల విద్యార్థులు తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు సామూహికంగా రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల ప్రధాన ద్వారం ఎదుట ఏర్పాటు చేసిన నోటీసు బోర్డుపై అంటించిన హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుని విద్యార్థులు పరీక్ష హాల్‌లోకి వెళ్లారు. పరీక్ష కేంద్రంలో ముందుగా విద్యార్థులకు ఓఎంఆర్ షీట్‌పై బబ్లింగ్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. ఆ తర్వాత ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగా మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది.

సౌకర్యాల కల్పన

పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. సెంటర్లలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేశారు. పరీక్ష సజావుగా సాగడానికి కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు, తోబుట్టువులు చెట్లకింద, వాహనాల్లో సేద తీరారు.

కేంద్రాలను పర్యవేక్షించిన ఆర్సీవో

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రవేశ పరీక్ష కేంద్రాలను సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన సీవోఈ బాలుర కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, కాసిపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల కేంద్రాలను సందర్శించి పరీక్ష తీరు పరిశీలించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, హెల్ప్‌డెస్క్‌ల వివరాలు తెలుసుకుని చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, స్వరూప, సంతోష్‌కుమార్, సిబ్బందిని ఆర్సీవో ప్రత్యేకంగా అభినందించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు

పరీక్ష కేంద్రం	విద్యార్థుల సంఖ్య	హాజరైనవారు
ఆదిలాబాద్ (సీవోఈ బాలికలు)	648	639
బోథ్ (బాలికలు)	648	634
ఇచ్చోడ (బాలురు)	255	246
ఆదిలాబాద్ డిగ్రీ కళాశాల (బాలికలు)	172	165
ఆసిఫాబాద్ (బాలురు)	528	519
సిర్పూర్‌టీ (బాలురు)	347	338
సిర్పూర్‌టీ (బాలికలు)	347	338
రెబ్బెన (బాలికలు)	273	266
బెల్లంపల్లి (సీవోఈ,బాలురు)	504	490
బెల్లంపల్లి (బాలికలు)	480	472
కాసిపేట (బాలురు)	401	390
లక్సెట్టిపేట (బాలికలు)	480	467
చెన్నూర్ (బాలికలు)	550	531
జైపూర్ (బాలురు)	285	279

'రాజకీయ జోక్యం వల్లే సింగరేణికి నష్టం'



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో రాజకీయ జోక్యం తగదని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం వల్లే సింగరేణికి నష్టం జరిగిందని నేడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మరింత జోక్యం చేసుకుంటోందన్నారు. తాము గుర్తింపు సంఘంగా గెలిచి నెలన్నర అవుతున్నా యజమాన్యం గుర్తింపు పత్రం ఇవ్వలేదన్నారు. టీబీజీకేఎస్ హయాంలో మాదిరిగానే కొందరు నాయకులు మస్టర్లు పడి బయటికి వెళ్లిపోతున్నారని, ఈ విధానం వల్ల కంపనీకి నష్టం జరుగుతుందన్నారు. అర్హులు కాని వారిని, ఫ్రీ మస్టర్లతో పబ్బం గడుపుకునే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కే.కొమురయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మురళి చౌదరి, బుచ్చిప్రసాద్, అఫ్రోజ్ ఖాన్, ఆకుల లక్ష్మణ్, సంఘం సదానందం, దాడి రాజయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మూడు కిరాణా దుకాణాల్లో చోరీ

వాంకిడి: మండల కేంద్రంలోని మూడు కిరాణా దుకాణాల్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మార్కెట్ ఏరియాలోని లతీఫ్ ఖాన్, మండోకార్ విలాస్, షేక్ సలావుద్దీన్‌కు చెందిన కిరాణ దుకాణాల్లో శనివారం రాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి కౌంటర్లలో ఉన్న నగదును దొంగిలించారు. లతీఫ్‌ఖాన్ దుకాణంలో రూ.30 వేలు, మండోకార్ విలాస్ దుకాణంలో రూ.1,600, షేక్ సలావుద్దీన్ దుకాణంలో రూ.8 వేల నగదు దొంగిలించారు. లతీఫ్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలింపు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్

మందమర్రిరూరల్: అందుగులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఊర చెరువు నుంచి ఆదివారం ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టి తరలిస్తున్నా సంబందిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. జాతీయ రహదారి పక్కనున్న పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రత్యేక అధికారుల పాలన మొదలు కావడంతోనే అక్రమ మట్టి తరలింపునకు తెరలేపినట్లైంద న్నారు. మట్టి తరలింపుతో ఊర చెరువులోపల ప్రమాదకర గుంతలు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుంచి మట్టి తరలింపుకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమంగా తరలించిన మట్టిని స్వాధీనం చేసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1261198]

■ Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ' బయోడిగ్రేడబుల్' కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696. [H-801665]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233772]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 20k ఫోన్: 8977639662/8977639663. [H-793685]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

అభిలాష్‌కు నంది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అభిలాష్

మంచిర్యాలఅర్బన్: సాహితీ, విద్యారంగంలో విశిష్టమైన సేవలకుగానూ పట్టణంలోని రాంనగర్‌కు చెందిన నూతి అభిలాష్‌కు తెలుగు వె లుగు జాతీయ నంది పురస్కారం లభించింది. ఆదివారం హన్మకొండలోని టీఎన్జీవో భవన్‌లో యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోష్ జయంతి ఉత్సవాల సందర్భంగా పురస్కా రం అందజేశారు. కా ర్యక్రమంలో పశ్చిమ శాసన సభ్యుడు రాజేందర్, వర్ధన్నపేట్ శాసనసభ్యులు నాగరాజ్, జిల్లా పరిషత్ చైర్మన్ సుధీర్‌కుమార్, నిర్వహణ కమిటీ చైర్మన్ వలబోజు మోహన్‌రావు, కోఆర్డి నేటర్ రాజ్‌కుమార్‌చార్యులు పాల్గొన్నారు.

సాయిరామాచార్యులకు జాతీయ పురస్కారం


పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

కాసిపేట: కాసిపేట మండల కేంద్రానికి చెందిన భూంపల్లి సాయి రామాచార్యులు వాస్తు జ్యోతిష్య పురోహిత రంగంలో తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆదివారం వరంగల్‌లోని టీఎన్జీవో భవన్‌లో యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ, తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకనంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందజేశారు.

కాకా పేరిట క్రికెట్ టోర్నమెంట్

- ఎమ్మెల్యేలు వివేక్, వినోద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేక్, వినోద్

మంచిర్యాలటౌన్: దేశంలోనే క్రికెట్ అభివృద్ధికి కృషి చేసిన కాకా వెంకటస్వామి పేరిట పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, వినోద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వివేక్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీసీఐ ఏర్పాటుతో దేశంలో వరల్డ్ క్రికెట్ కప్ నిర్వహణకు కాకా ఎంతగానో కృషి చేశారన్నారు. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా కాకా పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లాల్లో అనేక టోర్నమెంట్లు నిర్వహించామన్నారు. ప్రస్తుతం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండలస్థాయిలో 35, నియోజకవర్గ స్థాయిలో 21 మ్యాచ్‌లను నిర్వహించి విజేతకు రూ.3 లక్షలు, రన్నరప్‌కు రూ.2 లక్షల ప్రైజ్ మనీ అందించనున్నట్లు తెలిపారు.

యువకుల్లో స్ఫూర్తిని నింపుతాయి

బెల్లంపల్లి: క్రీడాపోటీలు యువకుల్లో స్ఫూర్తిని నింపుతాయని ఎమ్మెల్యేలు గడ్డం వినోద్ , వివేక్ అన్నారు. ఆదివారం దివంగత ఎంపీ గడ్డం వెంకటస్వామి స్మారకార్థం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జాతీయ స్థాయి కరాటే, యోగా, సింగరేణి ఏఎంసీ క్రీడా మైదానంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో బెల్లంపల్లి, నెన్నెల, వేమనపల్లి, తాండూర్, భీమిని, కన్నెపల్లి, కాసిపేట మండలాల నుంచి 40 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ యువనేత గడ్డం వంశీ, జాతీయ యోగా, కరాటే పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ మునిమంద రమేశ్, కో చైర్మన్ ఎనగందుల వెంకటేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, మాజీ చైర్‌పర్సన్ మునిమంద స్వరూప, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి , చిలుముల శంకర్, ఎం.నర్సింగరావు, రుద్రభట్ల సంతోష్, దావ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.